అక్రమ కేసులకు భయపడేది లేదు

● బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి కట్టా శ్రీను

సమావేశంలో మాట్లాడుతున్న కట్టా శ్రీనివాస్

నల్లగొండ, మార్చి 26: పదో తరగతి ప్రశ్న పత్రం లీకేజీ వ్యవహారంలో నిజం మాట్లాడిన కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నదని, ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి కట్టా శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదో తరగతి పేపర్ లీకేజీ వ్యవహారంలో అసలు నిందితులను వదిలేసి, దీనిపై నిలదీసిన కేటీఆర్‌పై కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అన్నారు. లీకేజీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఉన్న విషయం అందరికీ తెలుసని, వాళ్లను కాపాడేందుకు స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ విషయమై విచారణ చేసి అసలు కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, మైనం యుగంధర్, అంబటి ప్రవీణ్, కుంటిగొర్ల లింగయ్య, జాన్ ప్రేమ్, అనిల్, జానపాటి శంకర్, శివ పాల్గొన్నారు.

కేటీఆర్‌పై అక్రమ కేసును ఎత్తివేయాలి

చందంపేట (దేవరకొండ) : ఈ నెల 21న నకిరేకల్ పట్టణంలో జరిగిన 10వ తరగతి తెలుగు పేపర్ లీక్ విషయంలో అసలు విషయాలను బయట పెట్టినందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమంగా పెట్టిన కేసును తక్షణమే ఎత్తివేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుతామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుంటే కాలేజీలను నడుపలేం

● ఆర్డీఓకు టీపీడీపీఎంఏ వినతి

ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న కళాశాలల యాజమాన్యాలు

రామగిరి, మార్చి 26: ప్రైవేట్ కళాశాలల్లో చదువుకుంటున్న పేద, మధ్యతరగతి విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను విడుదల చేయడంలో జాప్యం చేయడం వల్ల తాము కాలేజీలు నడిపే పరిస్థితి లేదని తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్(టీపీడీపీఎంఏ) తేల్చి చెప్పింది. ఈ మేరకు సంఘం ఎంజీయూ శాఖ అధ్యక్షుడు, నీలగిరి విద్యా సంస్థల ప్రిన్సిపాల్ మారం నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగబోయే డిగ్రీ 2, 4, 6 రెగ్యులర్ సెమిస్టర్, 1, 3, 5 బ్యాక్‌లాగ్ పరీక్షలను నిర్వహించమని స్పష్టంచేశారు. ప్రభుత్వం అందచేసే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పైనే ఆధారపడి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అర్హత గల విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. అందుకు అయ్యే ఖర్చులను ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు భరిస్తువస్తున్నాయని పేర్కొన్నారు. నాలుగేండ్లుగా రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలో ప్రభుత్వం జాప్యం చేయడంతో యాజమాన్యాలు అధ్యాపకుల జీతాలు, భవనాల అద్దెలు, కరెంటు బిల్లులు, యూనివర్సిటీ రుసుము, ట్యాక్స్‌లు చెల్లించడానికి అప్పులు చేయాల్సి వస్తున్నదని తెలిపారు. వెంటనే రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో సంఘం నాయకులు డాక్టర్ నర్సింహారెడ్డి, నరేశ్, చుక్క సైదులు, వివిధ కళాశాలల నిర్వాహకులు ఉన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ : ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్ బకాయిలు చెల్లించాలని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మెండు వెంకట్‌రెడ్డి, నాయకులు తెడ్ల ధనుంజయ, కోల శ్రీనివాస్, దామెర శ్రీనాథ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

కొండమల్లేపల్లి, మార్చి 26 : కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఇలా త్రిపాఠి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలో పోలీస్ బందోబస్తును పరిశీలించారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీసులకు సూచించారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు, పరీక్ష కేంద్రంలో వసతులు వంటి విషయాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓ రమణారెడ్డి, ఎంఈఓ నాగేశ్వర్‌రావు, జనార్దన్‌రెడ్డి, ఎస్ఐ రామ్మూర్తి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

● డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ శ్రీనివాస్

చిట్యాల, మార్చి 26 : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ పుట్ల శ్రీనివాస్ సూచించారు. మండలంలోని వెల్మినేడు పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులు, రోగుల నమోదు రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉబ్బు నర్సింహ, సీహెచ్ఓ చక్రవర్తి, సూపర్‌వైజర్లు శ్యామల, లక్ష్మి, సిబ్బంది వీరారెడ్డి, ప్రసన్న కుమారి, హేమా, వరలక్ష్మి, త్రివేణి పాల్గొన్నారు.

సాంబశివుడి ఆశయ సాధనకు కృషి

● వైఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్‌యాదవ్

సాంబశివుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ, మార్చి 26: బీఆర్‌ఎస్ మాజీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొనపురి సాంబశివుడి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని యాదవ రాజ్యాధికార పోరాట సమితి(వైఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చల్లా కోటేశ్‌యాదవ్ పిలుపు నిచ్చారు. సాంబశివుడి 14వ వర్ధంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్‌యాదవ్ మాట్లాడుతూ సాంబశివుడు పేద ప్రజల అభ్యున్నతి కోసం, ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశాడన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారు బెల్లి నాగరాజు, బీసీ సంఘం నాయకులు చీర పంకజ్‌యాదవ్, బొబ్బల గోపాలకృష్ణ, దుడుకు లక్ష్మీనారాయణ, అల్లి సుభాశ్, గంగుల చందువంశీ, వజ్జ రమేశ్, అజయ్, అంజిబాబుయాదవ్, జంగయ్య, కిరణ్, ఉపేందర్, పురుశోత్తం పాల్గొన్నారు.

శేఖర్‌రెడ్డి కుటుంబానికి భాస్కర్‌రావు పరామర్శ

పద్మ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

వేములపల్లి, మార్చి 26: వేములపల్లి గ్రామ మాజీ లిఫ్ట్ చైర్మన్ అనిరెడ్డి శేఖర్‌రెడ్డి సతీమణి పద్మ మంగళవారం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు బుధవారం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పద్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చిర్ర మల్లయ్యయాదవ్, నంద్యాల శ్రీరాంరెడ్డి, రఘుమారెడ్డి, మాలి శేఖర్‌రెడ్డి, జావిద్, బండ్ల మట్టయ్య ఉన్నారు.

మాజీ ఉప సర్పంచ్‌కు గాదరి కిశోర్ పరామర్శ

సురేశ్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

శాలిగౌరారం, మార్చి 26 : శాలిగౌరారం మాజీ ఉప సర్పంచ్ గోదల సురేశ్‌రెడ్డి అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బుధవారం నకిరేకల్‌లోని ఆయన ఇంటికి వెళ్లి సురేశ్‌రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చాడ హతీశ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుజిలాల్ శేఖర్‌బాబు, నాయకులు నిమ్మల సురేశ్‌గౌడ్, చీమల శ్రావణ్ ఉన్నారు.

నేరుగా విత్తే పద్ధతితో అధిక లాభాలు

● కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

త్రిపురారం, మార్చి 26: వరిలో నేరుగా విత్తే పద్ధతి ద్వారా అధిక లాభాలు గడించవచ్చని కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం కేవీకేలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరి సాగులో నేరుగా విత్తే పద్ధతి ద్వారా కూలీల కొరతను అధిగమించవచ్చని, ఎక్కువ పిలకలు వచ్చి దిగుబడి కూడా అధికంగా వస్తుందని తెలిపారు. వరి కోతల అనంతరం పెసర, జీలుగు, మినుము వంటి పంటలు వేసి పెరిగిన తరువాత భూమిలో కలియదున్నాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త ఎన్.లింగయ్య, ఏఓ పార్వతీచౌహాన్, శాస్త్రవేత్తలు చంద్రశేఖర్, ఎస్.రాములమ్మ, జలకో హెచ్ఎన్ రామారావు, సుష్మా, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

విశ్వవసునామ పంచాంగం ఆవిష్కరణ

పంచాగం ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

రామగిరి, మార్చి 26: విశ్వవసునామ పంచాంగాన్ని బుధవారం తెలంగాణ మతైక అర్చక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, దర్వేశిపురం దేవాలయ ప్రధానార్చకుడు నాగోజు మల్లాచారి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెర్వుగట్టు దేవస్థానం ప్రధానార్చకుడు డాక్టర్ పోతుల పాటి రామలింగేశ్వరశర్మ, సంఘం ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి రాంబాబు శర్మ, దూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలాతాబాద్ వాసుదేవశర్మ, బ్రాహ్మణ సంఘాల నాయకులు గుదె లక్ష్మీనర్సయ్యశర్మ, కొడుగంటి వెంకరమణశాస్త్రి, శివప్రసాద్‌శర్మ,. హరీశ్ శర్మ, బ్రాహ్మణులు, అర్చకులు, పురోహితులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వకుంటే పారిశుధ్య పనులు నిలిపివేస్తాం

● పంచాయతీ కార్మికుల నిరసన

నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

నార్కట్‌పల్లి, మార్చి 26 : తమకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, దాంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని, వెంటనే వేతనాలు ఇవ్వకుంటే పారిశుధ్య పనులు చేయడం నిలిపివేస్తామని నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు జీతాలు ఇవ్వక పోవడంతో కుటుంబం రోడ్డున పడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వేతనాలు చెల్లించాలని కోరారు.

వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

నల్లగొండ రూరల్, మార్చి 26: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 14 ఏండ్లలోపు బాల బాలికలకు వివిధ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వడానికి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్ బాల్, అథ్లెటిక్స్, వంటి క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిర్వాహకులకు గౌరవవేతనంగా ఒక శిబిరానికి రూ.4 వేలు చెల్లిస్తామని తెలిపారు. ఆసక్తిగల వ్యాయమా ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు ఏప్రిల్ 5వ తేదీ వరకు జిల్లా యువజన, క్రీడలశాఖ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ : 9440072854 ను సంప్రదించాలని సూచించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

● బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రసన్నరాజ్

కట్టంగూర్, మార్చి 26 : సాగునీరు అందక పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మునుకుంట్ల గ్రామంలో ఎండిపోయిన వరి పంటచేలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. పంటలు ఎండిపోయి అప్పులు పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ రంగానికి సాగునీటితో పాటు 24 గంటల విద్యుత్ ఇచ్చి రైతును రాజును చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆయన వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, ఊట్కూరి ఏడుకొండలు, మాజీ సర్పంచ్ ముప్పిడి యాదయ్య, గుండాల మల్లేశ్, చిట్యాల రాజిరెడ్డి, మేకల రమేశ్, ఊట్కూరి భిక్షం ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

పాస్‌పోర్ట్ And OCI Card పోయినది

★ S ప్రభాకర్ రెడ్డి S/o. బాల్ రెడ్డి, R/o. H.no.4-11-202/1, చైతన్యపురి కాలనీ, G.V.గూడెం, నల్లగొండ, Town & Dist, అను నాయొక్క మనుమరాలు అయిన యానాల ఇషికారెడ్డి D/o. యానాల సందీప్ రెడ్డి కి చెందిన Passport No. AO4161857, United Sates Department of State and OCI card No A4104585 (File Reference No. USAH08B28N21) ఒరిజినల్ చైతన్యపురికాలనీ నుండి భాస్కరటాకీస్ రోడ్, నల్లగొండ ఆటోలో ప్రయాణిస్తుండగా పోయినవి. దొరికిన వారు సంప్ర|| 9440204111
NLG

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: దర్వేశిపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	సూర్యాపేట : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777630	చౌటుప్పల్ : 9182777638

పాఠశాలల్లో 'విద్యార్థులు ఒకరోజు శాస్త్రవేత్తలు' నిర్వహించాలి : డీఈఓ

రామగిరి, మార్చి 26: పాఠశాల స్థాయిలో విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించేందుకు పాఠశాల విద్యశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో 'విద్యార్థులు ఒక రోజు శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాల్లో విద్యార్థులకు క్విజ్, డిబెట్, పోస్టర్ తయారీ, సైన్స్ నమూనాల తయారీ పోటీలు నిర్వహించాలని సూచించారు. వాటి వివరాలను ఏప్రిల్ 5 లోగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంబంధింత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని కోరారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని, సెల్ 9848578845ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ, మార్చి 26: మిర్యాలగూడ పట్టణంలోని అశోక్‌నగర్, శాంతినగర్ ఫీడర్ల కింద గురువారం మెంటేనెన్స్ పనులు జరుగుతున్నందున గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టూటౌన్ ఏఈ రవీందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అశోక్‌నగర్, శాంతినగర్ కాలనీల్లో ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏప్రిల్ 10న మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు

మిర్యాలగూడ, మార్చి 26: మిర్యాలగూడ బార్ అసోసియేన్ ఎన్నికలు ఏప్రిల్ 10న నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారులు ఎ.సుధాకర్‌రావు, ఏచూరి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌లో 144 మంది న్యాయవాదులు ఉన్నారన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 27న ఓటరు జాబితా ప్రకటన, 27,28 తేదీల్లో 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 1న నామినేషన్ల పరిశీలన, 2న నామినేషన్ల ఉపసంహరణ, 3న అభ్యర్థుల జాబితా ప్రకటన, 10న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, వెంటనే ఫలితాల ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు.

ఇంటివద్దకే భద్రాద్రి సీతా రాముల కల్యాణ తలంబ్రాలు

మిర్యాలగూడటౌన్, మార్చి 26: ఆర్టీసీ కార్గో విభాగం ఆధ్వర్యంలో భద్రాద్రి సీతా రాముల కల్యాణ తలంబ్రాలు ఇంటి వద్దకే తెచ్చి ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మిర్యాలగూడ డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కావాల్సిన వారు రూ.151చెల్లించి బుక్ చేసుకుంటే కార్గో సిబ్బంది తలంబ్రాలను ఇంటివద్దకే తెచ్చి ఇస్తారన్నారు. బుకింగ్ కోసం సెల్ : 9154298693, 9666931799 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసు

కొండమల్లేపల్లి, మార్చి 26 : మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రామ్మూర్తి హెచ్చరించారు. బైక్‌లు నడుతూ పట్టుబడిన మైనర్లకు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో అవగాహన కల్పించారు. మైనర్లు రోడ్లపై మితిమీరిన వేగంతో వాహనాలు నడుపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

ఆస్తిపన్ను బకాయిపై వడ్డీ రాయితీ

మిర్యాలగూడటౌన్, మార్చి 28: ఆస్తి పన్ను బకాయిపై ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆస్తి పన్ను బకాయిల అపరాధ రుసుముపై 90 శాతం వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ఈ నెల 31వరకు ఆస్తిపన్ను చెల్లించి ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీని పొందాలని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ అధికారి జ్ఞానేశ్వరి, సాంబయ్య, రామలింగం, షాజీ ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు లక్ష్యా పాఠశాల విద్యార్థి

హాలియా, మార్చి 26 : జాతీయ స్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీలకు లక్ష్యా పాఠశాల విద్యార్థి అనూత్న ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అనుముల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 వరకు బీహార్ రాష్ట్రంలోని గయాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో అనూత్న తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని పాఠశాల చైర్మన్ తుమ్మపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కర్‌రెడ్డి, సర్వనేని సతీశ్, పీఈటీ పిల్లి రవి అభినందించారు.

త్రిపురారం సంత వేలానికి దరఖాస్తులు

త్రిపురారం, మార్చి 26: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే సంత నిర్వహణ హక్కుల కోసం ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి కోడిరెక్క రాజేందర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 28 వరకు టెండరు ఫారాలు సమర్పించాలని సూచించారు. వేలంలో పాల్గొనే వారు రూ.10వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, వేలం దక్కించుకున్న వారు ఆరోజు సాయంత్రం వరకు పూర్తి డబ్బులు చెల్లించాలని ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9848045099 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

భూ వివాదంపై ఆర్డీఓ విచారణ

నార్కట్‌పల్లి, మార్చి 26 : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నం.729లో ఉన్న భూమి విషయంలో నెలకొన్న వివాదంపై బుధవారం ఆర్డీఓ అశోక్‌రెడ్డి విచారణ నిర్వహించారు. సదరు సర్వే నంబర్‌లోని 1.6 ఎకరాల భూమిని తాము సైదమ్మ వద్ద కొనుగోలు చేసి సంవత్సరం పాటు కబ్జాలో ఉన్నామని బాధితురాలు ముప్పిడి చంద్రకళ తెలిపింది. అయినప్పటికీ నల్లగొండ పట్టణానికి చెందిన మహ్మద్ యూసుఫొద్దీన్‌కు తాసీల్దార్ పాసు పుస్తకాలు ఇచ్చారని సైదమ్మ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ ఇరు వర్గాలను పిలిపించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు.

హమాలీల సంక్షేమం కోసం సొసైటీ కృషి

మిర్యాలగూడ, మార్చి 26: హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారంతోపాటు వారి సంక్షేమానికి హమాలీ కోఆపరేటివ్ సొసైటీ కృషి చేస్తుందని ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ కోఆపరేటివ్ సొసైటీ(సీఐటీయూ) అధ్యక్షుడు ధనావత్ భిక్షానాయక్ అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్‌సీఐలో కలీం, రవీందర్ కాంట్రాక్ట్ కింద సబ్ కాంట్రాక్ట్‌గా మూడు నెలల పాటు హమాలీ పని చేసుకునేందుకు అవకాశం లభించదని, దాంతో సొసైటీలో ఉన్న 14 మంది టోలీల ఆధ్వర్యంలో 210 మంది హమాలీలకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. రవి, లాలూనాయక్, విజయ్‌నాయక్, బిల్లునాయక్, చందర్‌నాయక్, ఛత్రునాయక్, రామారావు, బాలోజీ, శంకర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

చండూరు, మార్చి 26: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీఓ యాదగిరి ఆదేశించారు. బుధవారం మండలంలోని కస్తాల గ్రామపంచాయతీ ఆవరణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ సైదులు, సిబ్బంది ఉన్నారు.

ఒంటరిగా ఉన్న వారిని బెదిరించి దారి దోపిడీకి పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

నీలగిరి, మార్చి 26: రాత్రి వేళల్లో ఒంటరి ఉన్న వ్యక్తులను టార్గెట్‌గా చేసుకొని దారి దోపిడీకి పాల్పడుతున్న నలుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ టూటౌన్ సీఐ రాఘవరావు, ఎస్ఐ వై.సైదులు తెలిపారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. తిరుమలగిరిసాగర్ మండలానికి చెందిన తుడుం ధనుంజయ్, గాంధీనగర్‌కు చెందిన మునగ వంశీ, గజ్జి సాయిశ్రీకాంత్, కట్టంగూర్ మండలం మల్లారానికి చెందిన పెద్ది శివప్రసాద్ నల్లగొండలో ఉండి చదువుకుంటూ తాగుడుకు బానిసయ్యారు. ఈజీ మనీ కోసం రాత్రి వేళల్లో నల్లగొండలో రెండు బైక్‌లపై తిరుగుతూ ఒంటరిగా ఉన్న వ్యక్తులపై దాడి చేసి వారి వద్ద ఉన్న నగదును దోచుకుంటున్నారు. ఈ నెల 20న అర్ధరాత్రి సావర్కర్ నగర్ రైల్వే ఫ్లైఓవర్ వద్ద రైల్వే స్టేషన్ వైపునకు నడుచుకుంటూ వెళ్తున్న వడ్లాల సాయికిరణ్ వద్దకు బైక్‌లపై వచ్చిన నిందితులు అతడిని కొట్టి అతడి వద్ద ఉన్న రూ.1400 నగదు, సెల్‌ఫోన్ లాక్కొని ఫోన్‌పే కోడ్ తెలుసుకొని వెళ్లిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బుధవారం ఉదయం నిందితులు తుడుం ధనుంజయ్ అద్దెకుంటున్న ఇంటి వద్ద ఉండగా ఆదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు, రూ.600ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ, మార్చి 26: పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన గుంటోజు మధుబాబు బుధవారం రాత్రి మద్యం మత్తులో టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు, పోలీసులు మంటలను ఆర్పివేసి అతడిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. అతను ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి కారణాలు తెలియరాలేదని, వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

చిట్యాల, మార్చి 26 : మండలంలోని గుమ్మలబావి, వనిపాకల, ఎలికట్టె గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం మార్కెట్ చైర్‌పర్సన్ నర్ర వినోదామోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్పీ జయలక్ష్మి, నాయకులు గుడిపాటి లక్ష్మీనర్సింహ, కాటం వెంకటేశం, దామనూరి పృధ్వీ, అద్దెల లింగారెడ్డి, అద్దెల నర్సిరెడ్డి, గుత్తా యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

కొరటికల్ గ్రామంలో నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

మునుగోడు, మార్చి 26 : దివ్యాంగుల సమస్యలను పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం వారిని చిన్నచూపు చూస్తున్నదని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ అన్నారు. బుధవారం మండలంలోని కొరటికల్ గ్రామంలో బడ్జెట్‌లో దివ్యాంగుల సంక్షేమానికి నిధులు కేటాయించకుండా ప్రభుత్వం వివక్ష చూపిన తీరును నిరసిస్తూ సంఘం నాయకులతో కలిసి కొబ్బరి పీచు తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగులు 30 లక్షల మంది ఉన్నారని, వారి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి గాలికి వదిలేసి ప్రజాపాలన పేరుతో సంబరాలు చేసుకోవడం విచారకరమన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే వేలాది మంది దివ్యాంగులతో అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న తాసీల్దార్ శ్రీనివాసులు

మర్రిగూడ, మార్చి 26 : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బుధవారం తాసీల్దార్ బక్క శ్రీనివాసులు తన కార్యాలయంలో అందించారు. 47మంది లబ్ధిదారులకు రూ.47,05,452 విలువ చెక్కులను అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ధర్మభిక్షం వర్ధంతి

ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చిట్యాల, మార్చి 26 : మండలంలోని గుండ్రాంపల్లిలో మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీతపనివారల, సీపీఐ నాయకులు బొడిగె సైదులు, జిల్లా సత్యం, కేతరాజు అంజయ్య, గోపగోని శేఖర్, బొడిగే బక్కశెట్టి పాల్గొన్నారు.

మునుగోడు : గౌడ సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఉన్న ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాలగోని సత్యం, మాజీ జడ్పీటీసీ జాజుల అంజయ్య గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, వివిధ పార్టీల నాయకులు పాలకూరి యాదయ్యగౌడ్, మారగోని అంజయ్యగౌడ్, నకిరేకంటి యాదయ్యగౌడ్, మాధగోని రాజేశ్ గౌడ్, జాజుల స్వామిగౌడ్ పాల్గొన్నారు.

మర్రిగూడ, మార్చి 26 : మాజీ ఎంపీ ధర్మభిక్షం వర్ధంతిని బుధవారం మండల కేంద్రంలో గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మభిక్షం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకల నిరంజన్‌గౌడ్, నాయకులు బూడిద సురేశ్, అల్వాల నర్సింహ, వల్లపు కేశవ్‌గౌడ్, కర్నాటి శేఖర్, అంజయ్య, శ్రీకాంత్, గిరి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని వినతి

శాలిగౌరారం, మార్చి 26 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తాసీల్దార్ యాదగిరికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి చెలకాని మల్లయ్య మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్‌కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మక్క బుచ్చిరాములు, కల్లూరి లింగయ్య, సిర్పంగి రాములు, శ్రీను, వెంకటయ్య, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : సీపీఎం ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు నారి అయిలయ్య, నాయకులు కంబాలపల్లి ఆనంద్, రమావత్ లక్ష్మణ్‌నాయక్, శ్రీనివాస్, కృష్ణయ్య, సత్యనారాయణ చారి, యాదగిరి, వెంకటేశం, నర్సింహ పాల్గొన్నారు.

మిర్యాలగూడ(మాడ్గులపల్లి) : మాడ్గులపల్లి తాసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అధికారికి అందించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, నాయకులు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, పాదూరి గోవర్ధని, పుల్లెంల శ్రీకర్ పాల్గొన్నారు.